'సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్' దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, సెప్టెంబర్27: స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ నర్సాపూర్ కోర్టులో ఒక స్పెషల్ జ్యుడిషియలల్ మేజిస్ట్రేట్ పోస్టు ఉన్నదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు న్యాయవాద డిగ్రీ కల్గి, బార్‌లో ఐదేండ్లు సభ్యత్వం కల్గి ఉండి, 45 ఏండ్ల వయస్సు పై ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు అక్టోబర్ 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు మెదక్ జిల్లా న్యాయస్థానముల సముదాయంలో నోటీస్ బోర్డులో ఉంచామని పేర్కొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో నేడు పెండింగ్ కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయస్థానముల సముదాయంలో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి జితేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్ జిల్లాలోని అన్ని న్యాయస్థానముల సముదాయంలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

నర్సాపూర్, సెప్టెంబర్ 27: రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి, రికార్డులు పరిశీలించారు. సైబర్ మోసాలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి, ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆయనతో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం, సిబ్బంది ఉన్నారు.

'రీఫిల్లింగ్‌తో గ్యాస్ సిబ్బంది మోసం'

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

వెల్దుర్తి, సెప్టెంబర్ 27: మండలంలోని దామరంచలో గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తూ పట్టుబడిన ఎస్‌వీఆర్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఘటనపై శుక్రవారం సివిల్ సప్లై అధికారులు విచారణ చేపట్టారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రణీతారెడ్డి, వెల్దుర్తి ఆర్ఐ జయభరత్‌రెడ్డితో కలిసి దామరంచకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. గ్యాస్ రీఫిల్లింగ్, ఏజెన్సీ సిబ్బంది పనితీరు, నిర్వాహకుల వ్యవహార శైలిపై అధికారిణికి గ్రామస్తులు వివరించారు. రీఫిల్లింగ్ విషయాన్ని ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డికి తెలుపగా గ్రామానికి వచ్చిన తమను బెదిరించి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తానని చెప్పి, సిబ్బందిని, వాహనాన్ని తీసుకొని వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వినియోగదారులపై దుర్భాషలాడుతారన్నారు. రూ.60 నుంచి రూ.70 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని, ఇవ్వక పోతే సిలిండర్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు విషయాలపై గ్రామస్తులు అధికారిణికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రణీతారెడ్డి మాట్లాడుతూ డబ్బులు అధికంగా ఇవ్వాల్సిన అవసరం లేదని, రసీదుపై ఉన్న డబ్బులు మాత్రమే ఇవ్వాలని, సిలిండర్ తీసుకునే సమయంలో కచ్చితంగా బరువు తూకం వేయాలని సూచించారు. గ్రామస్తుల ఫిర్యాదుపై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 27: అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దని, తెలియని యాప్‌లతో జాగ్రతగా ఉండాలని ట్రాయ్ రీజినల్ జాయింట్ అడ్వయిజర్ సురేశ్‌బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఆధ్వర్యంలో కన్జ్యుమర్ ఔట్ రిచ్ కార్యక్రమం నిర్వహించారు. సీ-డీఎసీ ప్రాజెక్ట్ మేనేజర్ జగదీశ్‌బాబు, డిజిటల్ ప్రాడ్ సెప్టీ లైఫ్ ఇన్ అవేర్నెస్ అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని మోసాలకు గురవుతున్నారన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థినులకు టెలీ కమ్యూనికేషన్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకురాళ్లు పాల్గొన్నారు.

హత్యారాజకీయాలు సరికాదు: బీఆర్ఎస్

ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

టేక్మాల్, సెప్టెంబర్ 27: హత్యా రాజకీయాలు సరికాదని, కాంగ్రెస్ నాయకులు భౌతిక దాడులకు పాల్పడడం ఆక్షేపనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప అన్నారు. శుక్రవారం టేక్మాల్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని కోరుతూ సీఐ రేణుకకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టేక్మాల్ చరిత్రలో హత్యారాజకీయాలు జరిగిన ఘటనలు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధయ్య, బసంతరావు, రమేశ్ నాయక్ తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో అప్రెంటీస్ ట్రైనీల ఎంపిక

జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థిని

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 27: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 39 మంది అభ్యర్థులు హాజరు కాగా 50 శాతం మంది ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ సింహరెడ్డి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అరబిందో ఫార్మాసుటికల్స్ ప్రొడక్షన్ విభాగంలో అప్రెంటీస్ ట్రైనీలుగా ఉద్యోగావకాశాలు కల్పించారు. మూడు రోజుల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు మెయిల్‌లో పంపబడుతాయని తెలిపారు. ఈ మేళాలో అకాడమిక్ కోఆర్డినేటర్ శరత్‌కుమార్, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేట శివారులో చిరుత సంచారం

రైతులు, కాలనీ వాసులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

రామాయంపేట, సెప్టెంబర్ 27: రామాయంపేట శివారులోని సప్తగిరి వెంచర్ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు కాలనీవాసులు, రైతులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున రైతులు, సీతాఫలాలకు వెళ్లే కూలీలు, ఒడ్డెరలు పనులకు వెళ్తున్నప్పుడు చిరుత తమకు కనిపించినట్లు పేర్కొన్నారు. వారం రోజులుగా చిరుత అటవీ ప్రాంతం పరిసరాల్లోనే తిరుగుతున్నట్లు తెలిపారు. దీంతో పేట అటవీశాఖ రేంజ్ అధికారి విద్యాసాగర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని చిరుత అడుగులను పరిశీలించారు.

సీసీ కెమెరాలు బిగిస్తాం

సప్తగిరి కాలనీవాసులు, రైతులు ఆందోళనకు గురికావద్దు, ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు బిగించి నిఘా ఉంచుతాం. చిరుతను పట్టుకునేలా ప్రయత్నం చేస్తాం. సీసీ కెమెరాల్లో చిరుత ఎక్కడి నుంచి వస్తుందో కదలికలను సునాయసంగా తెలుస్తుంది. ఈ ప్రాంతంలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. - విద్యాసాగర్, ఫారెస్టు రేంజర్

బాపూజీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

మెదక్ కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు



మెదక్ మున్సిపాలిటీ: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో బాపూజీకి నివాళులర్పిసున్న మున్సిపల్ చైర్మన్

- **తెలంగాణ పోరుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ**
- **కలెక్టర్ రాహుల్ రాజ్**

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి తహసీల్దార్, సిబ్బంది నివాళులు

మెదక్, (నమస్తే తెలంగాణ)/రామాయంపేట/నిజాంపేట/మెదక్ మున్సిపాలిటీ/ రేగోడ్/పెద్దశంకరంపేట/ మెదక్ అర్బన్/చేగుంట/కౌడిపల్లి, సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలి దశ పోరుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతిని నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజం పట్ల అంకితభావంతో, సేవా ధృక్పథంతో, అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన నాయకుడని కొనియాడారు. తెలంగాణ కోసం, బహుజన వర్గాల హక్కులు, రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడన్నారు. ప్రజల అస్థిత్వం కోసం పోరాడారని అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో..

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్ర పటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రామాయంపేట: దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

చేగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద లక్ష్మణ్ బాపుజీ జయంతి నిర్వహిస్తున్న తహసీల్దార్

అల్లాదుర్గం: బీజేపీ కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్వో

జిల్లాను పర్యాటక కేంద్రంగా తయారు చేయాలి

- **చారిత్రాత్మక నిర్మాణాలు, అందమైన ప్రదేశాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి**
- **కలెక్టర్ రాహుల్ రాజ్**

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయని, పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అవగాహన కల్పించే దిశగా టూరిజం డేను నిర్వహిస్తారన్నారు. అందమైన ప్రదేశాలు, చారిత్రాత్మక నిర్మాణాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఫొటో గ్యాలరీని కలెక్టర్, అధికారులు తిలకించారు. ఫొటోగ్రాఫర్లను సర్టిఫికెట్, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి జోజో పాల్గొన్నారు.

టూరిజం ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 27: పర్యాటక రంగ ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాలని, దానిపై అవగాహన పెంపొందించుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టూరిజం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యాటక రంగం, అవకాశాలపై 40 రోజుల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగ ప్రాముఖ్యత, సమాజంపై దాని ప్రభావంపై అవగాహన కల్పించడానికి ఏటా పర్యాటక దినోత్సవం జరుపుకొంటామన్నారు.

విద్యార్థులకు అభినందనలు

నిజాంపేట, సెప్టెంబర్ 27: వరల్డ్ టూరిజం డే సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచిన రాంపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రానాగౌడ్, శశికుమార్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ బహుమతులు అందజేశారు.

రేపు భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

నర్సాపూర్, సెప్టెంబర్ 27: రేపు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల కారణంగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయలేకపోతున్నామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నిజాంపేట, సెప్టెంబర్ 27: నిజాంపేటకు చెందిన గెరుగంటి కుమార్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సంఘ సేవకుడు మోహన్‌నాయక్ శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం అందజేశారు.

రామాయంపేటలో..

రామాయంపేట, సెప్టెంబర్ 27: అనారోగ్యంతో మృతిచెందిన మాజీ వార్డు సభ్యుడు చాకలి వెంకటి కుటుంబానికి సంఘ సేవకుడు మోహన్ నాయక్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

శుద్ధమైన జలం.. ఆరోగ్యానికి బలం

రేగోడ్, సెప్టెంబర్ 27: శుభ్రమైన నీరు తాగితే ఆరోగ్యంగా ఉంటామని దాత కొండి సంజీవులు అన్నారు. శుక్రవారం రేగోడ్ జడ్పీహెచ్ఎస్‌లో రూ.55వేల విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ను తహసీల్దార్ నరేశ్, ఎంఈవో గురునాథ్, దాత కొండి సంజీవులు ప్రారంభించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

బాల్‌రాజు (ఫైల్)

రామాయంపేట, సెప్టెంబర్ 27: బతుకు దెరువు కోసం నగరానికి వలస వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. మండలంలోని డి.ధర్మారం గ్రామానికి చెందిన నల్లగాశి బాలరాజు (45) ఐదేండ్ల కిందట ఇద్దరు పిల్లలు, భార్యతో హైదరాబాద్‌లోని ఓ కాలనీలో నివాసం ఉంటూ కూలినాలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం కూలికి వెళ్లిన అతడు పని చేసే చోటే పడిపోయాడు. దీంతో తోటి కూలీలు దవాఖానకు తరలించే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని గ్రామంలో అంత్యక్రియలు చేశారు.

విష్ణు ఫార్మసీలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

నర్సాపూర్, సెప్టెంబర్ 27: నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కళాశాలలో ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, ఐపీఏ నర్సాపూర్ లోకల్ బ్రాంచ్ వారి సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఆర్గనైజర్ అహ్మదిబాను, కో-ఆర్డినేటర్ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గాయత్రి, ఉన్నత భారత అభియాన్ కన్వీనర్ వనిత పాల్గొన్నారు.

ఓల్డ్ ఏజ్ హోమ్‌కు వృద్ధురాలి తరలింపు

నర్సాపూర్, సెప్టెంబర్ 27: అనాథగా రోడ్డుపై పడి ఉన్న వృద్ధురాలిని నర్సాపూర్‌లోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో శుక్రవారం చేర్పించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళకుమారి తెలిపారు. ఆమె వెంట నర్సాపూర్, శివంపేట్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

కనుల పండువగా సీఎస్ఐ ఆవిర్భావ వేడుకలు

చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

ఎమ్మెల్యే రోహిత్‌రావును సన్మానిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

- **భక్తులతో కిక్కిరిసిన ఏసయ్య మందిరం**
- **హాజరైన ఇన్‌చార్జి బిషప్ రూబెన్‌మార్క్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు**

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 27: సీఎస్ఐ, స్త్రీల మైత్రి సంఘం ఆవిర్భవించిన రోజు కావడంతో చర్చి వేడుకలను ప్రెసీబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు చర్చి ఎదుట జెండాను బిషప్మమ్మ ప్రిస్కిల్ల పరిమళ ఆవిష్కరించారు. అనంతరం చర్చి నుంచి అంబేద్కర్ చౌరస్తా, రాందాస్ చౌరస్తా, చమన్ నుంచి చర్చి వరకు ర్యాలీ కొనసాగింది. భక్తి గీతాలు, మహిళల నృత్యాలు, కోలాటలు ఆకట్టుకున్నాయి. శిలువను చర్చిలోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. చర్చి షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్మించిన మిషన్ దవాఖానను ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఐ సంఘం విశ్వనీయత, విశిష్టతతో కూడుకున్నదన్నారు. ఆవిర్భావ దినోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌ను బిషప్, సీఎస్ఐ కమిటీ సభ్యులు సన్మానించారు. శాంతయ్య, పాస్టర్లు డేవిడ్, జైపాల్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, మెదక్ డయాసిస్ బాధ్యులు, సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, శాంసన్ సందీప్, సువన్‌డగ్లస్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సీఎస్ఐ సంబురాలకు తరలిన భక్తులు

రామాయంపేట, సెప్టెంబర్ 27: మెదక్ సీఎస్ఐలో మహా దేవాలయంలో ఏసు దర్శనం కోసం రామాయంపేటలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన భక్తులు తరలివెళ్లారు. తాము వెళ్తున్నామని తెలిపారు.

బొడ్డెమ్మ పండుగ ప్రారంభం

చేగుంటలో బొడ్డమ్మ ఆట ఆడుతున్న మహిళలు, చిన్నారులు

నార్సింగి మండలం శేరిపల్లిలో బొడ్డమ్మ ఆడుతున్న మహిళలు

చేగుంట, సెప్టెంబర్ 27: మండలంలోని గ్రామాల్లో చిన్న బొడ్డెమ్మ సంబురాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చేగంట, నార్సింగి మండలాలతో పాటు పలు గ్రామాల్లో మహిళలు బొడ్డమ్మలను ఇంటి ముందు పెట్టి ఆడిపాడారు. అనంతరం ఒక చోటకు చేర్చి, పప్పు చక్కెరతో తయారు చేసిన నైవేద్యాని సమర్పించి ప్రసాదం స్వీకరించారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 27: లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో జరిగింది. పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌లోని నవాబ్‌పేట్‌కు చెందిన జహిదా బేగం(85) రాందాస్ చౌరస్తా సర్కిల్ రోడ్డు క్రాస్ చేస్తుండగా రామాలయం నుంచి మెదక్ పాత బస్టాండ్ వైపు వెళ్తున్న లారీ టీఎస్ 34టీబీ 4688 వృద్ధురాలిని ఢీకొన్నది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుంటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని దవాఖానకు తరలించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

అల్లాదుర్గం, సెప్టెంబర్ 27: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో పలువురు శాస్త్రవేత్తలతో కలిసి పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ రకాల సమస్యలను గుర్తించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయనతో ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌కుమార్, శాస్త్రవేత్తలు సరిత, ఫాతిమా, మండల వ్యవసాయాధికారి రాజేశ్, ఏఈవోలు విష్ణు, విఠల్, అమృత్, నవీన్ తదితరులున్నారు.

వరి పంటను పరిశీలించిన ఏడీఏ

నర్సాపూర్, సెప్టెంబర్ 27: మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో రామ్మోహన్‌రావు వరి క్షేత్రాన్ని ఏడీఏ సంధ్యారాణి శుక్రవారం పరిశీలించారు. ఆమె వెంట ఏవో దీపిక, ఏఈవో చంద్రవేణి ఉన్నారు.

పత్తి, ఉల్లి పంటల పరిశీలన

రేగోడ్, సెప్టెంబర్ 27: మండలంలోని ప్యారారం గ్రామంలో పత్తి, ఉల్లి పంటలను జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో ప్రతికూల పరిస్థితులతో పూతరాలిపోవడం, రసం పీల్చే పురుగు ఎక్కువగా ఉండటం గమనించారు. పచ్చదోమ, తెల్లదోమ నివారణకు, ఉల్లిలో ఎండు తెగులు రాకుండా మందులు సూచించారు. వారితో విజయ్, ఏఈవో సునీల్ కుమార్, మహేశ్, రైతులు అంజయ్య, కిష్టయ్య, గోపాల్ రెడ్డి, బషయ్య, వీరయ్య ఉన్నారు.

విష జ్వరంతో బాలిక మృతి

తనుశ్రీ (ఫైల్)

నిజాంపేట, సెప్టెంబర్27: జ్వరంతో తీవ్ర అస్వస్థతకు గురై బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని చల్మెడలో చోటుచేసుకున్నది. చల్మెడకు చెందిన కనకరాజు, లత దంపతుల కుమార్తె తనుశ్రీ(7) గురువారం జ్వరంతో తీవ్ర అస్వస్థకు గురైంది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడం తో తనుశ్రీ శుక్రవారం మృతి చెందింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.

NT-332617

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్